వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సంబరాలు

- ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా కె.కె.రాజును ప్రకటించడంపై హర్షాతిరేకాలు


వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజును గజమాలతో సత్కరిస్తున్న పార్టీ శ్రేణులు

సీతమ్మధార: విశాఖ ఉత్తర నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా కె.కె.రాజును పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించడంతో శనివారం పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా 14వ వార్డు బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని ఉత్తర పార్టీ కార్యాలయంలో కె.కె.రాజును భారీ గజమాలతో సత్కరించారు. అనంతరం కార్యాలయం నుంచి ఊరేగింపుగా బయటకు మోసుకుంటూ తీసుకొచ్చారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి, స్వీట్లు పంచిపెట్టి సందడి చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, సీనియర్ నాయకులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మూడుగుళ్లు ముఖద్వారం నిర్మాణానికి శంకుస్థాపన


ముఖద్వారం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న కె.కె.రాజు తదితరులు

సీతంపేట: అక్కయ్యపాలెం మూడుగుళ్లు ముఖద్వారం నిర్మాణానికి గౌరీ సేవా సంఘం అధ్యక్షుడు కొయిలాడ వేణుగోపాల్ ఆధ్వర్యంలో శనివారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథి వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్కయ్యపాలెం మూడుగుళ్లకు చుట్టుపక్కల ప్రాంతంలో మంచి గుర్తింపు ఉందని, పెద్ద ఎత్తున భక్తులు తరలి వస్తుంటారన్నారు. ముఖద్వారం నిర్మాణానికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, కార్పొరేటర్లు పెద్దిశెట్టి ఉషశ్రీ, ఆళ్ల లీలావతి శ్రీనివాస్, సంఘ ప్రతినిధులు ఆడారి పారుపల్లి రవి, రాజగిరి అప్పారావు, పాలక మండలి సభ్యులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు కేంద్రాలు సిద్ధం


మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్‌లో బెంచీలపై నంబర్లు వేస్తున్న ఉపాధ్యాయులు


టెన్త్ విద్యార్థినికి హాల్ టికెట్ అందిస్తున్న హెచ్‌ఎం శాంతికుమారి

సీతంపేట: స్థానిక మధురానగర్, అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీలోని జీవీఎంసీ హైస్కూల్స్‌లో పదో తరగతి ఫైనల్ పరీక్షలకు ఏర్పాట్లు చేశారు. సోమవారం నుంచి జరగనున్న టెన్త్ పరీక్షలకు మధురానగర్ స్కూల్‌లో 250 మంది విద్యార్థులు హాజరుకానున్నట్టు హెచ్‌ఎం శాంతికుమారి తెలిపారు. పరీక్షలకు 11 రూమ్‌ల్లో నంబర్లు వేసి సిద్ధం చేశామన్నారు. సోమవారం ఉదయం 9.30 గంటలకు పరీక్ష ప్రారంభమవుతుందని, 8.45 గంటల నుంచి విద్యార్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తామని చెప్పారు. ఎటువంటి ఎలక్ట్రానిక్ గాడ్జెట్లు పరీక్షా కేంద్రంలోకి అనుమతించమన్నారు. అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్‌లో 260 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని, 10 గదులు సిద్ధం చేశామని హెచ్‌ఎం లక్ష్మీ నరస తెలిపారు. తమ పాఠశాలలో చదవుతున్న 92 మంది విద్యార్థులకు హాల్ టికెట్లు అందజేశామన్నారు.

విద్యార్థులకు హాల్ టికెట్ల పంపిణీ

సీతంపేట మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్‌లో 87 మంది పదో తరగతి విద్యార్థులకు శనివారం పరీక్షల హాల్ టికెట్లు పంపిణీ చేశారు. పాఠశాల ఆవరణలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి వారి సమక్షంలో పాఠశాల హెచ్‌ఎం శాంతికుమారి హాల్ టికెట్లు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు పరీక్ష సమయంలో ఆందోళన, ఒత్తిడికి గురికావద్దని, ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో పరీక్షకు సిద్ధం కావాలని సూచించారు. ప్రశ్న పత్రాన్ని ఒకటికి రెండు సార్లు చదివి బాగా వచ్చిన సమాధానాలు ముందు రాయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.2.27 కోట్లతో గ్లో గార్డెన్ పార్క్


పార్క్ పనులకు శంకుస్థాపన చేస్తున్న వీఎంఆర్‌డీఏ చైర్మన్ సనపల చంద్రమౌళి

సీతమ్మధార: నగరంలోని డాక్టర్ వైఎస్సార్ సెంట్రల్ పార్కులో వీఎంఆర్‌డీఏ నిధులు రూ.2.27 కోట్లతో ఎల్‌ఈడీ గ్లో గార్డెన్ పార్క్ పనులకు శనివారం సంస్థ చైర్మన్ సనపల చంద్రమౌళి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో రెండోదిగా ఏర్పాటు చేస్తున్న గ్లో గార్డెన్ పార్క్ విశాఖకే తలమానికమన్నారు. ఇందులో ఏర్పాటు చేసే వివిధ పక్షులు, జంతువులు ఎల్‌ఈడీ కళాకృతులు చూపరులను అమితంగా ఆకట్టుకుంటాయని చెప్పారు. కార్యక్రమంలో విప్ శాసన మండలి సభ్యురాలు వరుదు కల్యాణి, కార్పొరేటర్ బిపిన్ జైన్, జాయింట్ కమిషనర్ రవీంద్ర, కార్యదర్శి కీర్తి, సీఈ భవానీశంకర్, ఎస్‌ఈ బలరాంరాజు, రేంజర్ శ్యామల, కార్యనిర్వాహక ఇంజినీర్లు ఎస్.వి.ఎస్.ఎన్.రాజు, బొట్టా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని మార్చే యోచనలో బీజేపీ


మాట్లాడుతున్న ఆచార్య కె.ఎస్.చలం

సీతంపేట: చట్టం ముందు అందరూ సమానమేనని రాజ్యాంగంలో ఉందని, దీనిని బీజేపీ ప్రభుత్వం మార్చాలని చూస్తోందని, అందుచేత మనుధర్మాన్ని తగులబెట్టి రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని యూపీఎస్సీ పూర్వ సభ్యుడు ఆచార్య కె.ఎస్.చలం పిలుపునిచ్చారు. దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో శనివారం రామాటాకీస్ రోడ్డులోని అంబేడ్కర్ భవన్‌లో 'మనువాదం - దళితులు - రాజ్యాంగం' అనే అంశంపై జరిగిన సదస్సులో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. మనుధర్మ శాస్త్రానికి వ్యతిరేకంగా అందరికీ సమాన హక్కులను కల్పించిన రాజ్యాంగం అమలు జరిగితేనే మనుగడ సాధించగలమన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చివేస్తుందని హెచ్చరించారు. బీజేపీ పాలకులు నేడు మనువాదాన్ని దేశంలో అమలు చేస్తున్నారని, దానికి ఉదాహరణ పార్లమెంట్ భవన ప్రారంభోత్సవానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ఆహ్వానించక పోవడమేనన్నారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జె.వి.ప్రభాకర్, జిల్లా గౌరవ అధ్యక్షుడు రాజబాబు, ప్రధాన కార్యదర్శి కె.సుబ్బారావు, సీపీఎం నాయకులు లోకనాథం, ఆర్పీఐ నాయకులు బి.కల్యాణరావు, శివ ప్రకాష్ పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా సత్యపద్మ


సత్యపద్మకు స్వాగతం పలుకుతున్న ఉద్యోగులు

ఎంవీపీకాలనీ: జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఎం.సత్యపద్మ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శనివారం ఆమె ఎంవీపీ కాలనీ సెక్టార్-9లోని డీఆర్‌డీఏ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెకు ఈడీ కార్యాలయం ఉద్యోగులు ఆహ్వానం పలికారు. అంతకుముందు సత్యపద్మ.. జిల్లా కలెక్టర్ మల్లికార్జున, జేసీ మయూర్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు.

సీసీ కెమెరాలతో చోరీల నియంత్రణ


దొండపర్తి వాసులకు అవగాహన కల్పిస్తున్న సీఐ విజయకుమార్

సీతమ్మధార: నేరాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఫోర్త్‌టౌన్ సీఐ విజయకుమార్ సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని దొండపర్తిలో శనివారం సీసీ కెమెరాలు, దొంగతనాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిచితులతో జాగ్రత్తగా ఉండాలని, వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు కాల్ చేసి సమాచారమందించాలని స్థానికులకు సూచించారు. ఇంట్లో బంగారు నగలు, నగదు ఉంచరదని, బ్యాంక్‌లో భద్రపరచడమే మేలన్నారు. ఊళ్లు వెళ్లేటప్పుడు ఇంటికి జాగ్రత్తగా తాళం వేయాలన్నారు. చోరీలు జరిగినప్పుడు పోలీసులకు సహకరించాలని సీఐ కోరారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

మురళీనగర్: జోన్-2 డివిజన్ మర్రిపాలెం సెక్షన్ పరిధి ఇండస్ట్రియల్ ఎక్స్‌ప్రెస్, ఏపీహెచ్‌సీ ఇండస్ట్రియల్ 11 కేవీ ఫీడర్లలో నిర్వహణ పనుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని జోన్-2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రాంతంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

వైభవుడికి సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో స్వామికి అభిషేకాలు, పూజలు జరిగాయి. మధ్యాహ్నం 300 మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం వైభవుడికి నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు సమర్పించారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పలు రైళ్ల రద్దు



తాటిచెట్లపాలెం: దక్షిణ మధ్య రైల్వే, విజయవాడ డివిజన్ పరిధిలో జరుగుతున్న ఆధునీకీకరణ పనుల నిమిత్తం విశాఖ నుంచి, విశాఖ మీదుగా ప్రయాణించే రైళ్లను ఆయా తేదీల్లో రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి తెలిపారు. మిగిలిన రైళ్లు యథావిధిగా నడుస్తాయన్నారు. వచ్చేనెల 1వ తేదీ నుంచి 28వ తేదీ వరకు మచిలీపట్నం-విశాఖ (17219) ఎక్స్‌ప్రెస్, వచ్చే నెల 2వ తేదీ నుంచి 29వ తేదీ తేదీ వరకు విశాఖ- మచిలీపట్నం (17220) ఎక్స్‌ప్రెస్, వచ్చే నెల 1వ తేదీ నుంచి 28వ తేదీ వరకు విశాఖ -గుంటూరు -విశాఖ (22701/22702) డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్ రద్దు చేశారు.

కొన్ని రైళ్ల దారి మళ్లింపు..

ఈ కింద పేర్కొన్న రైళ్లు ఆయా తేదీల్లో నిడదవోలు-ఏలూరు- విజయవాడ మీదుగా కాకుండా మళ్లించిన మార్గంలో వయా నిడదవోలు-భీమవరంటౌన్-గుడివాడ-విజయవాడ మీదుగా ప్రయాణిస్తాయని రైల్వే అధికారులు తెలిపారు. వచ్చే నెల 1, 8, 15, 22 తేదీల్లో ఎర్నాకుళం-పాట్నా(22643) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్.. 3, 5, 10, 12, 17, 19, 24, 26 తేదీల్లో ఎస్ఎంవీ బెంగళూరు-గౌహతి(12509) సూపర్‌ఫాస్ట్.. 1, 3, 5, 6, 8, 10, 12, 13, 15, 17, 19, 20, 22, 24, 26, 27 తేదీల్లో ముంబయి-భువనేశ్వర్ (11019) కోణార్క్ ఎక్స్‌ప్రెస్.. వచ్చే నెల 1 నుంచి 28 వరకు ధన్‌బాద్-అలెప్పీ(13351) బొకారో ఎక్స్‌ప్రెస్.. 4, 11, 18, 25 తేదీల్లో టాటానగర్-యశ్వంత్‌పూర్(18111) ఎక్స్‌ప్రెస్.. 3, 10, 17, 24 తేదీల్లో జసిడి -తాంబరం (12376)ఎక్స్‌ప్రెస్.. 1, 8, 15, 22 తేదీల్లో హతియా- ఎర్నాకుళం(22837) ఏసీ ఎక్స్‌ప్రెస్.. 6, 13, 20, 27 తేదీల్లో హతియా-ఎస్ఎంవీ బెంగళూరు(18637) ఎక్స్‌ప్రెస్.. 2, 7, 9, 14, 16, 21, 23, 28 తేదీల్లో హతియా-ఎస్ఎంవీ బెంగళూరు (12835) ఎక్స్‌ప్రెస్.. 5, 12, 19, 26 తేదీల్లో టాటానగర్-ఎస్ఎంవీ బెంగళూరు(12889) ఎక్స్‌ప్రెస్‌లు మళ్లించిన మార్గంలో నడుస్తాయి.

అప్‌గ్రేడెడ్ లోకోషెడ్‌లో డీఆర్‌ఎం తనిఖీలు


ఎలక్ట్రిక్ లోకోషెడ్‌ను పరిశీలిస్తున్న డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ మర్రిపాలెంలో ఆధునీకీకరించిన ఎలక్ట్రిక్ లోకోషెడ్‌లో శనివారం డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ తనిఖీలు నిర్వహించారు. విశాఖపట్నం ఎలక్ట్రికల్ లోకోషెడ్‌లో అప్‌గ్రేడ్ చేసిన డబ్ల్యూఏజీ9 లోకోను ఆయన పరిశీలించారు. ఈ లోకోతో ప్రయాణం సుఖంగాను, లోకో పైలట్‌కు మరింత సౌకర్యవంతమైన డ్రైవింగ్ అనుభూతిని కల్పిస్తుందని సిబ్బంది తెలిపారు. అండర్ గేర్ నిర్వహణ డిపో, లేబొరేటరీ, షెడ్‌లో గల లోకోలను కూడా డీఆర్‌ఎం పరిశీలించారు. అధికారులు, సిబ్బందితో మాట్లాడి వాటి వివరాలు తెలుసుకున్నారు.

క్లుప్తంగా

ముగిసిన గ్లకోమా వారోత్సవాలు


బహుమతి అందిస్తున్న డాక్టర్ జ్యోతిర్మయి

సీతంపేట: ప్రపంచ గ్లకోమా అవగాహన వారోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో జరిగిన ముగింపు సభలో ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ టి.జ్యోతిర్మయి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ గ్లకోమాపై అవగాహన కల్పించడం వైద్య ఉద్యోగులుగా మనందరి బాధ్యతని పేర్కొన్నారు. వారం రోజులపాటు గ్లకోమా అవగాహన కార్యక్రమాలు ఎక్కడెక్కడ ఎలా జరిగాయో వివరించారు. ఈ సందర్భంగా జూనియర్ వైద్యులు, వైద్య విద్యార్థులకు గ్లకోమా అవగాహన కోసం వక్తృత్వ పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. ఆర్‌ఎంవో నవీన్ కుమార్, వైద్యులు రమణ, వాణిశ్రీ, శ్రీలక్ష్మి, ఇతర వైద్యులు, పీఎంవోవోలు ఉమా శ్రీనివాస్, సురేష్, సుబ్బలక్ష్మి, సుజాత, జూనియర్ వైద్య విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు


తోపుడుబళ్లను వెనక్కి జరుపుతున్న పోలీసులు, జీవీఎంసీ సిబ్బంది

సీతమ్మధార: ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించే దిశగా పోలీసులు, జీవీఎంసీ ఆధ్వర్యంలో శనివారం నక్కవానిపాలెం రోడ్డుపై ఏర్పాటు చేసిన తోపుడు బళ్లను వెనక్కి జరిపించారు. ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు చేపట్టారు. రహదారికి ఇరువైపులా తోపుడు బళ్లతోపాటు చిన్న చిన్న షాపులను వెనుకకు జరపడంతో రోడ్డు విశాలంగా మారింది. రాంగ్ రూట్‌లో వాహన ప్రయాణాలను అరికట్టేందుకు చర్యలు తీసుకున్నారు.

బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా కోడూరి సుశీల


సుశీలను అభినందిస్తున్న కె.కె.రాజు

సీతమ్మధార: రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా కోడూరి సుశీల నియమితులయ్యారు. ఈ సందర్భంగా శనివారం బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆమెను ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు అభినందించారు.

ఘనంగా వెంకన్న తీర్థం


కలియుగ వేంకటేశ్వర స్వామికి పూజలు చేస్తున్న భక్తులు, అర్చకులు

కంచరపాలెం: జీవీఎంసీ 55వ వార్డు తిక్కవానిపాలెం కలియుగ వేంకటేశ్వర స్వామి ఆలయంలో గ్రామాధ్యక్షుడు ఉమ్మిడి వాసుదేవరావు, ప్రధాన కార్యదర్శి పట్టిమ రాజు ఆధ్వర్యంలో శనివారం తీర్థ(పరస) మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి జగనాథశర్మ, శంకరశర్మ నేతృత్వంలో ఉదయం విశేష పూజలు, సుప్రభాత సేవ నిర్వహించారు. పద్మావతి, అలమేలు మంగమ్మ సమేత వేంకటేశ్వరుడికి ప్రాతఃకాల తిరువారాధన, అష్టోత్తరాలు, తులసీదళ బిల్వార్చన, మంగళశాసనాలు, పంచామృతాభిషేకాలు చేశారు. సాయంత్రం పరసలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మురుగు ప్రవాహానికి అడ్డుకట్ట

- బిర్లా కూడలి సర్వీస్ రోడ్డులో మురుగు సమస్యకు పరిష్కారం
- రూ.16 లక్షలతో కాలువ నిర్మాణం
- పాదచారులు, వాహన చోదకుల హర్షం


నాడు: సర్వీస్ రోడ్డులో మురుగు నీటి ప్రవాహం


నేడు: జాతీయ రహదారి బిర్లా జంక్షన్ సర్వీస్ రోడ్డులో నిర్మించిన కాలువ

మురళీనగర్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి శరవేగంతో స్పందించి చర్యలు తీసుకుంటుంది. బిర్లా జంక్షన్ జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న సర్వీస్ రోడ్డుకు అనుబంధంగా పక్కా కాలువ నిర్మించి ప్రజల ఇబ్బందులు తీర్చేందుకు జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకున్నారు.

బిర్లా కూడలి జాతీయ రహదారిని ఆనుకుని కంచరపాలెం వైపు వెళ్లే సర్వీస్ రోడ్డులో మురుగు నీటి ప్రవాహానికి అడ్డుకట్ట వేశారు. గతంలో ఈ రహదారిని ఆనుకుని బార్ వన్ నుంచి పెట్రోల్ బంకు వరకు ఎగువ నుంచి వచ్చే వర్షపు నీటితోపాటు గతంలో ఇక్కడ నిర్మించిన కాలువ శిథిలమవడంతో మురుగు నీరు రహదారిపైకి పొంగి ప్రవహించేది. ఈ రహదారి నిత్యం రద్దీగా ఉంటూ రాకపోకలు సాగించే వాహన చోదకులు, పాదచారులు మురుగు నీటి వల్ల నానా అవస్థలు పడేవారు. మురుగు నీరు రహదారిపై నిలిచిపోవడంతో చెరువులా తయారయ్యేది. వర్షా కాలంలో రహదారి మొత్తం నీటిలో మునిగిపోయేది.

శరవేగంగా పనులు

జీవీఎంసీ అధికారులు మురుగు సమస్యను పరిశీలించి ఈ ప్రాంతంలో పక్కా కాలువ నిర్మించి ప్రజల కష్టాలను తీర్చాలని నిర్ణయించారు. 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ సూచనల మేరకు దీని నిర్మాణానికి రూ.16 లక్షలు మంజూరు చేశారు. పనులు శరవేగంగా పూర్తి చేసే క్రమంలో బాటం కాంక్రీట్, రాఫ్ట్ వర్క్, వాల్ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. వంద మీటర్ల నిడివి కలిగిన ఈ కాలువపై పైకప్పు వేసి వినియోగంలోకి తెస్తారు. ఈ పని కూడా త్వరలోనే పూర్తవుతుందని కార్పొరేటర్ ప్రసాద్ తెలిపారు. సమస్య పరిష్కారంపై స్థానికులు, పాదచారులు, వాహన చోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇబ్బందులు తొలగాయి



బిర్లా జంక్షన్ సర్వీస్ రోడ్డుపైకి మురుగు నీరు వచ్చి పడటంతో రాకపోకలకు చాలా ఇబ్బందులు పడేవారం. వాహనాలపై ప్రయాణించినప్పుడు మురుగునీరు తుళ్లి అపరిశుభ్రంగా ఉండేది. పైగా దుర్వాసనతో ప్రయాణం కష్టమయ్యేది. ఇప్పుడు దీని స్థానంలో కొత్తగా కాలువ నిర్మించడం వల్ల ఇబ్బందులు తొలగాయి.

– పల్లా చంద్రమౌళి, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు

ట్రాఫిక్ సమస్యలు తీరాయి



కాలువ శిథిలమై మురుగు నీరు పొంగి రోడ్డుపైకి రావడంతోపాటు వర్షాల్లో అవస్థలు పడేవారం. ఎదురెదురుగా వాహనాలు తప్పించుకునే సమయంలో పాదచారులు చాలా ఇబ్బందులు పడేవారు. ఒక్కోసారి ప్రమాదాలు జరిగేవి. జీవీఎంసీ సకాలంలో చర్యలు తీసుకుని కాలువ నిర్మించడంతో ట్రాఫిక్ సమస్యలు తీరాయి.

– కె.బలరామ్, మురళీనగర్ సెక్టార్-3

బాక్సింగ్ పోటీల విజేతలకు అభినందనలు


బంగారు పతకాలు సాధించిన జూనియర్ బాక్సర్‌లను అభినందిస్తున్న కె.కె.రాజు

సీతమ్మధార: ఆంధ్ర బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సింహాచలంలో జరిగిన సబ్ జూనియర్ బాక్సింగ్ పోటీల్లో బంగారు పతకాలు సాధించిన బాక్సర్‌లను వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు అభినందించారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో శనివారం ఈ కార్యక్రమం నిర్వహించారు. కంచరపాలెం ధర్మానగర్‌కు చెందిన క్యూబా బాక్సింగ్ టీమ్‌లో నలుగురు బాలురు, ఇద్దరు బాలికలు బంగారు పతకాలు సాధించారు. ఈ నెల 18 నుంచి 24 వరకు ఉత్తరప్రదేశ్‌లో జరిగే నేషనల్ బాక్సింగ్ పోటీలకు వీరు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ మరిన్ని విజయాలు సాధించి దేశానికి, రాష్ట్రానికి మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. సబ్ జూనియర్ కోచ్ కల్యాణ సంతోష్, కోచ్‌లు హర్యాల జోషఫ్, హర్యాల జీవా, సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

త్యాగధనుడు పొట్టి శ్రీరాములు


గైస్‌లో పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ వెంకటరమణ, విభాగాధిపతులు


పాలిటెక్నిక్ కాలేజీలో పొట్టి శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ నారాయణరావు, విభాగాధిపతులు

మురళీనగర్: భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఏర్పాటుకు తన జీవితాన్నే పణంగా పెట్టిన పొట్టి శ్రీరాములు పట్టుదలకు మారుపేరుగా నిలిచారని, ఆ త్యాగధనుడిని స్మరించుకోవడం మనందరి బాధ్యతని కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ(గైస్) ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అన్నారు. కళాశాలలో శనివారం పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు దేశభక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. ముందుగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కెమికల్ ఇంజినీరింగ్ విభాగం హెడ్ డాక్టర్ బి.వి.లక్ష్మణరావు, ఇతర విభాగాధిపతులు పాల్గొన్నారు.

అమరజీవికి ఘన నివాళి

తెలుగు రాష్ట్రం ఏర్పాటుకు తన ప్రాణాలు అర్పించిన పొట్టి శ్రీరాములు త్యాగధనుడని కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు అన్నారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా కాలేజీలో అమరజీవి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గాంధీజీ పిలుపు మేరకు ఆయన హరిజనోద్ధరణకు ఉద్యమం చేశారన్నారు. విద్యార్థులు పొట్టి శ్రీరాములు త్యాగనిరతిని అలవరుచుకోవాలని ప్రిన్సిపాల్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

నేటితరానికి పొట్టి శ్రీరాములు ఆదర్శం

సీతమ్మధార: గురుద్వారా దరి ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఫైనాన్స్ డైరెక్టర్ డి.చంద్రం పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీజీ ఆశయాలకు ఆకర్షితుడై రైల్వేలో ఇంజినీర్ ఉద్యోగాన్ని వదిలి స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న పొట్టి శ్రీరాములు తుది శ్వాస విడిచే వరకు జాతి ఐక్యత కోసం పోరాడి అమరజీవిగా చరిత్రలో నిలిచారన్నారు. ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి అసువులు బాసిన ఆయన జీవితాన్ని నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్లు ఎం.రామకృష్ణ, వి.విజయలలిత, డి.సుమన్, కల్యాణి, జె.శ్రీనివాసరావు, అచ్చి రవికుమార్, ఎం.మసిలమణి, ఎం.రవీంద్ర, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


ఏపీఈపీడీసీఎల్ కార్యాలయ ఆవరణలో అమరజీవికి నివాళులర్పిస్తున్న అధికారులు